టీజీఐఐసీ నిర్లక్ష్యంతో అమాయకులు బలి!

- పరిశ్రమలకు సేకరించిన భూములను విక్రయిస్తున్న పట్టాదార్లు
- పరిహారం చెల్లించినా తమపేర రిజిస్ట్రేషన్ చేయించుకోని టీజీఐఐసీ
- రికార్డుల్లో ఇంకా పట్టాదార్ల పేర్లు.. మోసపోతున్న ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) నిర్లక్ష్యం కొందరు అమాయకులకు శాపంగా మారుతున్నది. ఏండ్ల క్రితం పరిశ్రమల కోసం సేకరించిన భూములను కూడా టీజీఐఐసీ తన పేర మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో నష్టపరిహారం తీసుకున్న పట్టాదార్లు తమ భూములను అమాయకులకు అంటగడుతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు వాస్తవం తెలిసిన తర్వాత లబోదిబోమంటున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు లెక్కలేనన్ని ఉండొచ్చని అధికారులే అంగీకరిస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి, మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం పరిశ్రమలకు విక్రయించడం టీజీఐఐసీ బాధ్యత. రైతుల నుంచి సేకరించిన భూములను నష్టపరిహారం చెల్లించిన వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడంవల్ల పట్టాదార్లు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు. అయితే టీజీఐఐసీకి చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా ప్రాంతాల్లో సేకరించిన భూములు ఇంకా పట్టాదార్ల పేర్లతోనే కొనసాగుతుండటంతో వారు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల కొనుగోలు చేస్తున్న అమాయకులు మోసపోతున్నారు. ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో వివిధ సర్వే నంబర్లలో దాదాపు 20 ఏండ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ సుమారు 200 ఎకరాల భూములు సేకరించింది. అందులో పావువంతు భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కాగా, మిగిలిన భూములు ఖాళీగానే ఉన్నాయి. భూములు సేకరించినా వాటిని పరిశ్రమల పేరుతో గానీ, ఏపీఐఐసీ పేరుతోగానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఇంకా ఆ భూములు పట్టాదార్ల పేరు మీదే ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వాటిని మళ్లీ ఇతరులకు విక్రయించారు.

చేతులెత్తేసిన టీజీఐఐసీ

సర్వే నంబరు 81 పరిధిలో ఇటువంటి ఘటన ఒకటి తాజాగా వెలుగుచూసింది. 20 ఏండ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆరు ఎకరాల భూమి ఇప్పటికే నలుగురు చేతులు మారింది. తీరా ఐదో వ్యక్తి దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, టీజీఐఐసీ పేర రిజిస్టర్ అయినట్టు రికార్డులు చూపుతున్నాయి. దీంతో విక్రయానికి ఉంచిన ఆ నాలుగో వ్యక్తి తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. తాను పట్టాదారు వద్ద భూమి కొనుగోలు చేసినట్టు, తన భూమిని విక్రయించేందుకు ఎన్వోసీ ఇవ్వాలని బాధితుడు టీజీఐఐసీని వేడుకొంటున్నాడు. అధికారులు మాత్రం ఎన్వోసీ ఇచ్చే ఆస్కారం లేదని చేతులెత్తేశారు. ఆ 200 ఎకరాల భూముల్లో ఇలాంటి ఇంకా ఎన్ని ఉన్నాయో తేలాల్సి ఉన్నది.

స్థానికంగా విచారించుకొని కొనుగోలు చేయాలి: టీజీఐఐసీ

పారిశ్రామిక ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయాలనుకొనేవారు సమగ్రంగా విచారించుకొని, స్థానికులతో మాట్లాడిన తర్వాతే భూములు కొనుగోలు చేయాలని టీజీఐఐసీ అధికారులు సూచిస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల తాము సేకరిస్తున్న భూములను వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతున్నామని, దీన్ని ఆసరాగా చేసుకొని పట్టాదార్లు నష్టపరిహారం తీసుకొని కూడా ఇతరులకు విక్రయించుకొంటున్నట్టు తెలిసిందని చెప్తున్నారు. సేకరించిన భూములను టీజీఐఐసీ పేర మ్యుటేషన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉంటుందని, వాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము చేసేదేమీ లేదని స్పష్టంచేస్తున్నారు. మొత్తంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ఎంతోమంది మోసపోతున్నారు.

అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతరం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లు(10 బిలియన్ డాలర్లు)గా నమోదైందని తెలిపింది. 2022-23 ఏడాదికిగాను 72 వేల కోట్లు(9 బిలియన్ డాలర్లు) ఆర్జించింది. ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానిగా ఎదిగిన అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్

60 రోజుల వ్యాలిడిటీతో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 60 రోజుల కాలపరిమితితో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1జీబీ డాటాతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. 4జీ సేవలు అందించడానికి సిద్ధమతున్న సంస్థకు ఈ నూతన ప్లాన్‌తో కస్టమర్లకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపింది. ఇతర టెలికం సంస్థల కంటే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఇరు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీనం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నది. ఈ విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన 100 ఈక్విటీ షేర్లకుగాను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌నకు చెందిన 155 ఈక్విటీ షేర్లు లభించనున్నాయి.

నూతన కార్ల సందడే..సందడి

వచ్చే నెలలో విడుదలకానున్న ఐదు మాడళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ప్రతి నెలలో అర డజన్‌కు పైగా మాడళ్లను విడుదల చేస్తున్న సంస్థలు..వచ్చే నెలలోనూ ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఐదు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో కియా, నిస్సాన్, బీవైడీ, మెర్సిడెజ్ బెంజ్‌లు ఉన్నాయి. ఈ వివరాలు..

కియా నుంచి రెండు మాడళ్లు

కొరియాకు చెందిన వాహన సంస్థ కియా.. దేశీయ మార్కెట్లోకి నయా కార్నివాల్‌ను విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 3న మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఈ కారు ధర రూ.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. 2.2 లీటర్ 4-సిలిండర్ డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 193 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. దీంతోపాటు మరో ఈవీ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 99.8 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈవీ 9లో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 24 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జింగ్‌కానున్నది.

నిస్సాన్ మ్యాగ్నైట్ ఫెసిలిఫ్ట్

వచ్చే నెల 4న మ్యాగ్నైట్ ఫెసిలిఫ్ట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది నిస్సాన్ ఇండియా. దేశీయ మార్కెట్‌తోపాటు ఇతర దేశాలకు అనుగుణంగా లెఫ్ట్-హ్యాండ్ డ్రైవ్ వెర్షన్ కూడా తీసుకురాబోతున్నది.

బీవైడీ ఈమ్యాక్స్ 7

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ మరో మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 8న ఈమ్యాక్స్ 7 మాడల్‌ను అందుబాటులోకి తెస్తున్నది. అడాస్ సూట్, ప్రీమియం స్విచ్ గేర్, సాఫ్ట్-టచ్ మెటీరియల్స్, లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారులో 55.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 420 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్



జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 14.4 ఇంచుల సెంట్రల్ టచ్‌స్క్రీన్‌తోపాటు 12.3 ఇంచుల ప్యాసింజర్ టచ్‌స్క్రీన్, 4డీ సరౌండింగ్ సౌండ్ సిస్టమ్ కలిగిన ఈ మాడల్‌ను 2.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లు

ముంబై, సెప్టెంబర్ 28: ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నది. ఐఫోన్ 16ని కొనుగోలు చేసినవారికి రూ.5 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చునని తెలిపింది. అలాగే ఈఎంఐ ఆప్షన్‌లో నెలకు రూ.2,497 చెల్లించి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లు డిసెంబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. పాత ఐఫోన్ కలిగివున్నవారు అప్‌గ్రేడ్‌తో ఐఫోన్ 16ని కొనుగోలు చేసిన వారికి క్యాష్‌బ్యాక్‌తోపాటు వడ్డీ రహిత ఈఎంఐని ఎంచుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్ కేవలం ఐఫోన్ 16 ప్రొ మ్యాక్స్, ఐఫోన్ 16 ప్రొ, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 మాడళ్లకు వర్తించనున్నది. ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లు అప్‌ట్రానిక్స్, యూనికార్న్, క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్, సంగీత మొబైల్స్‌లో లభించనున్నది.

రియల్టీ సంస్థలపై రెరా కొరడా

వెయ్యికిపైగా ప్రాజెక్టులపై రూ.35 కోట్ల జరిమానా

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా కొరడా ఝులిపించింది. మార్కెటింగ్ కార్యకలాపాలు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఉక్కుపాదం మోపడానికి రెరా పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో రెరా ఏర్పాటైన గడిచిన ఏడేండ్లలో ఏకంగా వెయ్యికి పైగా ప్రాజెక్టులపై రూ.36 కోట్ల వరకు జరిమానా విధించింది. వీటిలో ఇప్పటికే రూ.15 కోట్లను ఆయా సంస్థలు చెల్లించాయి కూడా. ఎనిమిది కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన, 600 గజాలు అంత కంటే ఎక్కువ స్థలంలో నిర్మించి విక్రయాలు చేసినా ప్రాజెక్టులు రెరా పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సంస్థలు తప్పకుండా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రెరా వద్ద నమోదు చేసుకోకుండానే విక్రయాలు జరిపితే ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సంస్థలపై ఈ మండలి భారీస్థాయిలో జరిమానా విధిస్తున్నది.

రెరా ఏర్పాటైన తరువాత వివిధ ప్రాజెక్టులకు విధించిన జరిమానాలు

సంవత్సరం	ఫైన్ వేసిన ప్రాజెక్టులు	జరిమానా మొత్తం (రూ.కోట్లలో)
2018-19	335	3.06
2019-20	49	0.79
2020-21	04	0.29
2021-22	03	0.23
2022-23	180	1.70
2023-24	311	26.69
2024-25	131	2.96
మొత్తం	1013	35.72

రెరా నంబర్ లేకుండానే ప్రకటనలు..

రెరా నంబర్ లేకుండానే రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు జారీ చేసిన సంస్థలపై ఫిర్యాదులు అందడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాణిజ్య ప్రకటనలపై ఖచ్చితంగా రెరా నంబర్ ఉండాల్సిందేనని షరతు విధించింది. దీంతో తమ ప్రకటనల పక్కన రెరా నంబర్‌ను ఖచ్చితంగా ముద్రిస్తున్నాయి. ప్రీలాంచ్ ఆఫర్లు, ముందస్తుగా ఒప్పందం చేసుకున్న మేరకు ప్లాట్లను అప్పగించకపోవడం, వాటిలో సరైన వసతులు కల్పించకపోయిన ప్రాజెక్టులపై కూడా చర్యలు తీసుకున్నది. ఒక దగ్గర ప్రాజెక్టు నమోదు చేసుకొని..అదే అనుమతితో మరి కొన్ని చోట్ల విక్రయాలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

సేంద్రియ సాగు సందర్శన



ప్రకృతి పంటను పరిశీలిస్తున్న రైతులు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 28: మండలంలోని మల్లాయిగూడెం, పండువారిగూడెం, దిబ్బగూడెం, రామన్నగూడెం గ్రామాల్లో జీవ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కొందరు రైతులు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. ఈ వ్యవసాయ క్షేత్రాలను అశ్వాపురం మండలంలోని కొమ్ముగూడెం, జగ్గారం, కోర్సవారిగూడెం గ్రామాల రైతులు శనివారం సందర్శించారు. జీవ వనరుల కేంద్రంలో జీవామృతం, ఘన జీవామృతం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం తదితర కషాయాల తయారీని తిలకించి వివరాలు తెలుసుకున్నారు. యంత్ర పరికరాలను పరిశీలించారు. వరి, ఎకో ఫాం పాండ్, దేశీ వరి పంటలు, కూరగాయలు, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. వీటన్నింటిపై వారికి జీవ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఐఎఫ్ఆర్‌పీ పెరుబోయిన శ్రీనివాస్‌రావు, కమిటీ అధ్యక్షుడు కొర్రి మల్లయ్య అవగాహన కల్పించారు. చెస్టెడ్ ఎన్‌జీవో ప్రోగ్రాం మేనేజర్ శేఖర్, సభ్యులు కిరణ్, నాగరాజు, జీవ రైతులు మల్లయ్య, సారిన కాంతమ్మ, మొడియం సీతారాములు, మొడియం సింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గిరిజన క్రీడాకారుల ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న స్పోర్ట్స్ ఆఫీసర్

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 28: కిన్నెరసాని క్రీడాపాఠశాలలో జోనల్ స్థాయి క్రీడాపోటీలు అక్టోబర్‌లో జరగనున్నాయి. వీటిలో పాల్గొనే విద్యార్థులను ఈ నెల 29, 30 తేదీల్లో కిన్నెరసాని క్రీడా పాఠశాలలో ఎంపిక చేస్తారు. దీనిపై చర్చించేందుకు దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్ ఆధ్వర్యంలో పాల్వంచలోని కార్యాలయంలో శనివారం సన్నాహక సమావేశం జరిగింది. కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్ ఆఫీసర్ బి.గోపాల్‌రావు మాట్లాడుతూ.. సీనియర్, జూనియర్ విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, ఆర్చరీ, అథ్లెటిక్స్, క్యారమ్స్, చెస్ తదితర పోటీలు జరుగుతాయని చెప్పారు. అక్టోబర్‌లో కిన్నెరసానిలో జోనల్ స్థాయి పోటీలు ఉంటాయని చెప్పారు. అధికారులు వెంకటనారాయణ, రామారావు, రవి, వ్యాయామ ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, అన్నం వెంకటేశ్వర్లు, నగేష్, వెంకన్న, నరసయ్య, రాంబాబు, ప్రత్యూష, సావిత్రి, రమేష్, గోపాల్, సదర్‌లాల్, సతీష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఇద్దరు చిన్నారుల మృతి

పినపాక, సెప్టెంబర్ 28: మండలంలోని సింగిరెడ్డిపల్లి పంచాయతీ మద్దులగూడెంలో ఇద్దరు చిన్నారులు అనారోగ్యంతో వేర్వేరు ఆసుపత్రుల్లో శనివారం మృతిచెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పండ ప్రసాద్‌కు చెందిన 2 నెలల పాప ఇటీవల అనారోగ్యానికి గురైంది. పాపను రెండు రోజుల క్రితం మణుగూరు అక్కడి నుంచి భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతిచెందింది. కాగా ఇదే గ్రామానికి చెందిన ఇర్పమహేష్, మంజుల రెండు నెలల బాబు మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురై మణుగూరులోని పిల్లల ఆసుపత్రికి, భద్రాచలం, అక్కడి నుంచి కొత్తగూడెంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా శనివారం మృతిచెందాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంగన్‌వాడీల్లో పోషణ మాసోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి: సీమంతాలు చేస్తున్న సూపర్‌వైజర్ అరుణ

అశ్వారావుపేట: సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 28: పోషణ మాసోత్సవంలో భాగంగా మండలంలోని కంపగూడెం, నామవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతాలను, చిన్నారులకు అక్షరాభ్యాసాలను శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ నిర్వహించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు.

అశ్వారావుపేట, సెప్టెంబర్ 28: మండలంలోని పేరాయిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు సీమంతాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.విజయలక్ష్మి, వరలక్ష్మి, మరియమ్మ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు బేబీ, ఏడబ్ల్యూటీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 28: మండలంలోని చాతకొండ గ్రామంలో శనివారం గర్భిణులకు సీమంతాలను పాల్వంచ సీడీపీవో లక్ష్మీప్రసన్న శనివారం నిర్వహించారు. సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 28: కొత్తగూడెం 25వ వార్డులోని మెప్మా ఆఫీస్‌లో గర్భిణులకు కౌన్సిలర్ సాహేరాబేగం సీమంతాలు చేశారు. 24వ వార్డు కౌన్సిలర్ బాలిశెట్టి సత్యభామ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శైలజ, మట్ట రాజకుమారి, వార్డు ఆర్‌పీ రాజకుమారి, ఓబీ సరోజ పాల్గొన్నారు.

'పంచాయతీ'కి సమాయత్తం!

విడుదలైన ఫైనల్ పబ్లికేషన్

జిల్లాలో 6,23,947 మంది ఓటర్లు

అభ్యర్థుల ఎంపికకు పార్టీల కసరత్తు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పంచాయతీ ఎన్నికల కోసం ముసాయిదా సిద్ధమైంది. డీపీవో రాజమౌళి ఆధ్వర్యంలో ఓటర్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల గోడలపై అధికారులు శుక్రవారం ప్రదర్శించారు. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, 26న అభ్యంతరాల పరిశీలన తర్వాత తుది జాబితాను రూపొందించి శనివారం ఫైనల్ పబ్లికేషన్ విడుదల చేసింది. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో కార్యదర్శుల వద్ద ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచారు.

జిల్లాలో 6,23,947 మంది ఓటర్లు

గత అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీలకు సంబంధించి ఓటర్ల జాబితాను రూపొందించారు. జిల్లాలోని 21 మండలాలకు సంబంధించి 479 పంచాయతీల్లోని 4,232 వార్డుల్లో ఫైనల్ జాబితాలో 6,23,947 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో పురుషులు 3,04,264 మంది, మహిళా ఓటర్లు 3,19,660 మంది, 23 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

ఎన్నికలకు సమాయత్తం..

ఓటర్ల తుది జాబితా విడుదల కావడంతో అధికార యంత్రాంగం పంచాయతీ ఎన్నికలకు సమాయత్తమవుతోంది. అయితే ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఉండేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాలను గుర్తించి అన్ని రకాల వసతులు ఉన్నాయా.. లేదా.. అని పరిశీలిస్తున్నారు.

అభ్యర్థుల ఎంపికలో పార్టీలు

పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు కసరత్తు చేస్తుంటే.. మరోవైపు అన్ని పార్టీలు పంచాయతీల్లో గెలుపు గుర్రాల వేటలో పడినట్లు తెలుస్తున్నది. ఇప్పటికే అనధికారికంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని పంచాయతీలవారీగా ఎవరిని నిలబెడితే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆరా తీస్తున్నారు. అయితే గతంలో పని చేసిన మాజీలు మరో అవకాశం తమకు ఇవ్వాలని నేతల చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తుంది. అధికార పార్టీతోపాటు ఇతర పార్టీలు తమ తమదైన శైలిలో పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఒకవైపు ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు, మరోవైపు అభ్యర్థుల ఎంపిక కోసం పార్టీల నేతలు బిజీబిజీగా మారినట్లు తెలుస్తుంది.

విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన హెచ్ఎం

పాఠశాల ఎదుట తల్లిదండ్రులు, గ్రామస్తుల ఆందోళన

విచారణ చేపట్టిన డీఈవో సోమశేఖర శర్మ, సీఐ సాగర్

హెచ్ఎంపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

వైరారూరల్, సెప్టెంబర్ 28 : విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ హెచ్ఎం ఉదంతం ఖమ్మం జిల్లా వైరా మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. దీంతో అతడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పాలడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చావా శ్రీనివాసరావు హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో 8, 9, 10వ తరగతి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వారిని నానా బూతులు తిడుతున్నాడు. దీంతో ఓపిక నశించిన విద్యార్థినులు విషయాన్ని తమ తల్లిదండ్రులకు చెప్పడంతో గ్రామస్తులతో కలిసి పాఠశాల వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాఠశాలకు చేరుకొని ఆఫీస్ రూంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతుండగా అక్కడే ఉన్న తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆఫీసు గదికి తాళం వేసి ఆందోళనకు దిగారు. దీంతో డీఈవో సోమశేఖర శర్మ, సీఐ నూనావత్ సాగర్ పాఠశాల వద్దకు చేరుకొని తల్లిదండ్రులకు నచ్చజెప్పి.. గదిలో నిర్బంధించిన ఎంఈవోను బయటకు తీసుకొచ్చారు. హెచ్ఎంను సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేయడంతో విచారణ చేపట్టి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చారు. కాగా.. విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తారనే విషయాన్ని ముందుగానే పసిగట్టిన హెచ్ఎం శ్రీనివాసరావు పాఠశాల నుంచి తప్పించుకున్నాడు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు పాఠశాలలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఫిర్యాదు స్వీకరించిన సీఐ సాగర్ హెచ్ఎంపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

డివిజన్ స్థాయి క్రీడలకు ఎంపికలు

భద్రాచలం, సెప్టెంబర్ 28: గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల, వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో బాల, బాలికలకు డివిజన్ స్థాయి క్రీడలకు ఆది, సోమ వారాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లలోపు బాల, బాలికలకు జూనియర్స్, 17 ఏళ్లలోపు బాల, బాలికలకు సీనియర్స్ విభాగంలో ఎంపికలు జరుగుతాయన్నారు. ప్రతి పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు మాత్రమే హాజరుకావాలన్నారు. సంబంధిత హెచ్ఎంలు, వార్డెన్‌లు తప్పనిసరిగా డివిజన్ స్థాయి క్రీడల్లో విద్యార్థులు పాల్గొనేలా చొరవ చూపాలన్నారు.

గుప్త నిధులకు తవ్వకాలు

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

- పరారీలో మరో ముగ్గురు

గుప్త నిధుల కోసం తవ్విన ప్రదేశం

అశ్వారావుపేట, సెప్టెంబర్ 28: గుప్త నిధి తవ్వకాలు సాగిస్తున్న ఇద్దరిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన నల్లపు అనంత శేషు ఇంట్లో ఆయనకు తెలియకుండానే మేనత్త రోజారాణి శుక్రవారం హైదరాబాద్ నుంచి కొందరిని పిలిపించి తవ్వకాలు చేపట్టింది. ముందుగా ఇంట్లో పూజలు చేసింది. ఆ తర్వాత తవ్వకాలు మొదలుపెట్టారు. ఆ ఇంటి నుంచి శనివారం భారీ శబ్దాలు వస్తుండడంతో స్థానికులు అనుమానించారు. వారు ఇచ్చిన సమాచారంతో ఎస్సై యయాతి రాజు, సిబ్బందితో కలిసి ఆ ఇంటికి చేరుకున్నారు. వీరిని చూడగానే, తవ్వకాలు సాగిస్తున్న వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు వెంబడించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మురో ముగ్గురు పరారయ్యారు. ఈ ఐదుగురికి చెందిన స్కోడా కారును స్వాధీనపర్చుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సొంత పనులు చేయిస్తే ఊరుకోం..

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 28: కొత్తగూడెం రామవరంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం పారిశుధ్య కార్మికులతో డాక్టర్లు, నర్సులు తమ సొంత పనులు చేయిస్తే సహించేది లేదని ఈ కేంద్రం అభివృద్ధి కమిటీ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య హెచ్చరించారు. ఈ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ముందుగా, అక్కడి పారిశుధ్య కార్మికులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆ తర్వాత, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలిశారు. పారిశుధ్య కార్మికులతో డాక్టర్లు, నర్సులు స్వంత పనులు చేయించుకుంటున్నారని చెప్పారు. దీనిని సహించేది లేదని హెచ్చరించారు. డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్ల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. 11వ వార్డు కౌన్సిలర్ భూక్యా శ్రీనివాస్, టూ ఇంక్లైన్ మాజీ సర్పంచ్ నగేష్, రమేష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రంగారావు, హరినాథ్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న బందు వెంకటేశ్వరరావు

భద్రాచలం, సెప్టెంబర్ 28: అక్టోబర్ 1న భద్రాచలం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వయోవృద్ధులను గౌరవిస్తూ శాలువా, పూలదండలతో సత్కరించనున్నట్లు తెలిపారు.